



గోపిమూర్తి విజయంపై హర్షం

ప్రజాశక్తి-కందుకూరు

ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి విజయం సాధించడం ఉద్యమ విజయం అని యు. టి. ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు తెలిపారు. షేక్ సాబ్జి మరణంతో ఖాళీ అయిన ఆ స్థానానికి జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర కోశాధికారి గా ఉన్న బి.గోపి మూర్తి అఖండ విజయాన్ని సాధించారరు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి రోజున ఈ విజయం అందుకోవడం గర్విం చదగిన విషయమని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.


హర్షం వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

జాయింట్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై సత్వరమే స్పందించాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీతో పాటు డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మొత్తం 256 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఎస్‌పి జి.కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 85 ఫిర్యాదులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. బాధితుల నుంచి స్వీకరించిన 85 ఫిర్యాదులపై శాఖ పరమైన విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయనున్నట్లు తెలిపారు.


ఎస్‌పి కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌పి కృష్ణ కాంత్

15న 'నుడా' ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు :ఈనెల 15న నుడా ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చెయ్యబోతున్నానని.. నా కుటుంబ సభ్యుల్లాగా భావించే.. ప్రతి ఒక్క కార్యకర్త ఈ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గత ఐదేళ్ల అరాచక పాలన గురించి ,కార్యకర్తల అందించిన తోడ్పాటు, ఎంఎల్‌ఎ బాలకష్ణ, సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇచ్చిన సహకారం ఒక్కసారి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, ఎంఎల్‌ఎ బాలకష్ణ ఆశీస్సులతో రెండో సారి నుడా ఛైర్మన్ పదవి దక్కిందన్నారు. మంత్రి నారాయణ నాయకత్వంలో నుడా పరిధిలోని గ్రామాలకు అభివద్ధి చేస్తానని తెలిపారు.


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజావక్తి - గుడ్లూరు

గుడ్లూరు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతత్వ అభియాన్ పథకం కింద 27 మంది గర్భిణులకు వైద్యాధికారిణి డాక్టర్ సబిహా సుల్తానా వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు ప్రతి నెల 9న గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేస్తు న్నారు. అందులో భాగంగా వీటిని సోమవారం గర్భి ణులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు వైద్య పరీక్షలు నిర్వహించుకున్న గర్భవతులు అందరికీ పండ్లు పాలు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు కాన్పులు ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలోని చేయించుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి యోజన పథకం కింద నగదు బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుం దనిసబిహాసుల్తానా తెలిపారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు :అశోక్ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల యాజమాన్యం వారి సహకారంతో నేడు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో ఉచిత దంత వైద్యశిభిరం నిర్వహిస్తున్నట్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వైద్యశిభిరంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు కె.గణేష్‌కుమార్, సిహెచ్ శ్రీకాంత్‌లు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు

రైతుల సమస్యలు పరిష్కరించాలి : ఇంటూరి

ప్రజాశక్తి -గుడ్లూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఎంఎల్‌ఎ ఇంటూరు నాగేశ్వరరావు రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం ఆయన ఆకస్మికంగా వచ్చారు. రైతుల సమస్యలు పరిష్కారం చేయకుండా కాలయాపన చేస్తూ రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం పట్ల ఆయన రెవెన్యూ అధి కారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి ఆయన చేరుకుని గత వారం గ్రీవెన్స్ కి వచ్చిన అర్జీలని పరిశీలించారు.. రైతులు విన్నవించే చిన్న చిన్న సమస్యలను కూడా ఎందుకు పరిష్కరించరని తహశీల్దార్ స్వర్ణను ప్రశ్నించారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ జి స్వర్ణ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆ వివరాలు వెల్లడించారు.

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం మాతా శిశు మరణాల సబ్‌కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం. పెంచలయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లాలో2024 గత అక్టోబర్ నెలలలో సంభవించిన 5 శిశు మరణాలకు గల కారణాలు మరియు లోపాలు గురించి క్షుణ్ణముగా సమీక్ష నిర్వహించారు. అనంతరం డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ ని గుర్తించి త్వరిత గతిన నమోదు చేయాలన్నారు. ప్రొఫెసర్స్ (గైనిక్)జిజిహెచ్ డాక్టరు స్వర్ణముఖి, డాక్టరు భవాని, జనరల్ మెడిసిన్ డాక్టరు శోభారాణి, పిఓ (ఎఫ్ పి సి) డాక్టరు పి ఎల్ దయాకర్, జిజిహెచ్ పిడియాట్రీషన్స్ డాక్టరు చందన్ రెడ్డి ఉన్నారు.

చిన్నారుల దంత సంరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

చిన్న పిల్లలలో దంత సంరక్షణకు "నారాయణ చిన్నారి చిరునవ్వు" పథకం చక్కటి భరోసాను ఇస్తుందని నారాయణ దంత వైద్య శాల డీన్ డాక్టరు నువ్వుల శివకుమార్ అన్నారు. సోమవారం రూరల్ మండలం వావిలేటిపాడు ప్రాంతంలోని ఎంపిపి (ఉర్దూ) పాఠశాలలో "నారాయణ చిన్నారి చిరునవ్వు" పథకం ప్రారంభోత్సవ శిబిరాన్ని నిర్వహించారు. ఆయన పాఠశాల విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏ విధంగా బ్రష్ చేసుకోవాలి, ఆహారం తీసుకున్న అనంతరం నోటిని ఏ విధంగా శుభ్రపరుచుకోవాలి, చాక్లెట్స్ , ఐక్రీమ్ వంటి పదార్థాలు , గట్టిగా ఉన్న ఆహార పదార్థాలను తినడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. డాక్టర్లు అంచల కార్తీక్, కనమర్లపూడి సాయికిరణ్, ఆళ్ల అంజలి కీర్తన, రెడ్డి శ్రావ్య ఉన్నారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా 10 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష తెలిపారు. కార్యక్రమంలో అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘ కార్యాలయము కమిషనర్ ఛాంబర్‌లో జరిగే ప్రజా పిర్యాధుల కార్యక్రమాని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె. అనూష పట్టణ ప్రజలను కోరారు. సమస్యలు ఉంటే 9177700267 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకులను పురస్కరిం చుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కందుకూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త చింత రబోయిన నరేష్ మాట్లాడారు. సోనియా గాంధీ మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.





నిరసన తెలుపుతున్న దృశ్యం

'అదాని' అక్రమాలపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి-కందుకూరు : ఆదాని అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, గత ప్రభుత్వం అదానితో చేసుకున్న చీకటి ఒప్పందాన్ని బహిర్గతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య హాజరై ప్రసంగించారు. సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి బూసి సురేష్ బాబు, షేక్ హుస్సేన్, మురళి, ఉప్పుటూరి మాధవరావు, ఎండ్లూరి వీరాంజనేయ కుమార్, జడ సునీల్, నత్త రామారావు, కోటేశ్వరరావు, సీతారామయ్య, సుభాన్, దుర్గాప్రసాద్, ఆనంద్ మోహన్ ఉన్నారు.

హెల్ప్‌లైన్ సేవలుసద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు :కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బాధితులు వ్యయ ప్రయాసాలకోర్చాల్సిన అవసరం లేదని, ఏదైనా సమస్య ఉంటే హెల్ప్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూర్యతేజ పిలుపు నిచ్చారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

'చెన్నుపాటి' ఆశయ సాధనకు కృషి : యుటిఎఫ్

పజాశక్తి-కందుకూరు

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ మండలాల అధ్యక్ష ,కార్యదర్శులు, జిల్లా బాధ్యులు పాల్గొని లక్ష్మయ్యకి నివాళులు అర్పించారు. బాధ్యులు మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కషి చేయాలన్నారు. ఈ రాష్ట్ర ఉపాధ్యాయ సంక్షేమం కోసం, విద్యారంగ అభివద్ధి కోసం చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. చట్టబద్ధంగా ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమం పురుడు పోసుకోవడానికి చెన్నుపాటి అనేక కష్టాలు పడ్డాడని చివరకు మద్రాస్ హైకోర్టు తీర్పు కారణంగా ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమం ఏర్పడిందని అందుకే చెన్నుపాటిని ఈ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు అంటారని వక్తలు కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు,మండల అధ్యక్ష కార్యదర్శులు దామా కొండప నాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు,గొట్టిపాటి మాధవ,మక్కెన రమేష్ బాబు, మన్నం మాధవ రావు, హనుమంత రావు, ముప్పారాజు కోటేశ్వరరావు, కష్టా రెడ్డి పాల్గొన్నారు.



విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి 'గంటా' మృతి

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు ప్రాంత రైతాంగానికి ఉత్తమ సేవలందించిన విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి గంటా వెంకట్రావు (65) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. గంటా వెంకట్రావు వ్యవసాయ విస్తరణాధికారిగా కందుకూరు ప్రాంత రైతాంగానికి సేవలందించి గుర్తింపు పొందారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు ఏ సమయంలో వెళ్లినా వెంకట్రావు అందుబాటులో ఉండి సేవలందించడంలో ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. రైతులతోపాటు కందుకూరు ప్రాంత ప్రజలు, ఆయన సన్నిహితులు తరలివచ్చి ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఆయన అంతిమ యాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


గంటా వెంకట్రావు(ఫైల్)

రేషన్ బియ్యం తరలించేవారిపై చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

రేషన్ బియ్యం తరలించేవారిపై కఠిన చట్టాలు ఉపయోగించాలని దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్‌డిఒకు వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కావలికేంద్రంగా పెద్దపెద్దరైస్ మిల్లులు ఉన్నాయని, రైస్ మిల్లర్లు కొందరు చుట్టుపక్కల 4 నియోజకవర్గాలలో బియ్యం సేకరించి బియ్యం లారీల ద్వారా కష్ణపట్నంకు తరలిస్తున్నారని అధికారులు గుర్తించిన విషయం గుర్తు చేశారు. జరుగుమల్లి విజయరత్నం, ఆలూరి బ్రహ్మయ్య, కందిపట్లరామదాసు, చెరుకూరి జనార్ధన్ అనేక మంది పాల్గొన్నారు.

పశువులు రోడ్లపై సంచరిస్తే

యజమానులపై చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రధాన రోడ్లమీద వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని, వాటిని తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్య అధికారి డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. సోమవారం పురపాలక పట్టణ శాఖ మంత్రి డాక్టర్. పి. నారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజల ఆదేశాల మేరకు పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్ లో భాగంగా రెండు బందాల స్థానిక మద్రాస్ బస్టాండ్, ఆర్.టి.సి. బస్టాండ్, బి.వి. నగర్, సంతపేట ప్రాంతాల్లో సంచరిస్తున్న 5 పశువులను కల్లూరుపల్లి గోశాలకు తరలించారు.

ఆర్‌టిసి డిపోలో కార్మికుల వెట్టి చాకిరీ


తోడిన వర్షం నీటిని బయట పోస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ఆర్‌టిసి డిపోలో దినసరి వేతన కూలీలకు వెట్టిచాకిరి తప్పడం లేదు. ఇటీవల కందుకూరు ప్రాంతంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసిన విషయం తెలిసింది.ఈ వర్షాల వల్ల కందుకూరు ఆర్‌టిసి బస్టాండ్ వర్షంతో చెరువుని తలపించింది. ఆర్‌టిసి బస్సులు రిపేర్ చేసే వర్క్ షాప్‌లోకి నీరు చేరింది. వర్షానికి వచ్చిన నీటిని మోటారు ద్వారా బయటికి పంపడం అధికారులు మానుకొని అక్కడున్న కాంట్రాక్టు కార్మికులు ద్వారా బకెట్లతో ఎత్తిపోయడం కనిపించింది. మోటారు పెడితే డబ్బులు ఖర్చు అవుతాయి అనే ఉద్దేశంతో అధికారులు కార్మికులు చేత నీటిని బయటకు మోపించటం కనిపించింది.



నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు ప్రకారం లేకుండా జరుగుతున్న నిర్మాణాలను, అనధికార కట్టడాలను గుర్తించి తొలగించాలని కమిషనర్ సూర్య తేజ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక బాలాజీ నగర్, మూలాపేట, వాకర్స్ రోడ్డు ప్రాంతాల్లో నిర్మాణాలు జరుగుతున్న భవనాలను కమిషనర్ తనిఖీ చేశారు. భవనాల నిర్మాణాలకు సంబంధించి అనుమతుల పత్రాలను కమిషనర్ పరిశీలించారు. ప్లాన్ ప్రకారం నిర్మాణం జరగాలని, నిబం ధనలకు విరుద్ధంగా అదనపు నిర్మాణం జరిపితే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

భవన నిర్మాణాలకు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరి అని, అనుమతులు లేకుండా ఏలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. అనంతరం ప్రధాన కాలువల పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు. ఎస్‌ఇ రామ్మోహన్ రావు,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ ఉన్నారు.



నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-కందుకూరు :కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. నీహారిక పండ్లు, కూరగాయలతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై మూడు రోజులు నైపుణ్యాభివద్ధి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నీహారిక మాట్లాడుతూ పండ్లు , కూరగాయలులో పీచు పదార్థాలు, సూక్ష్మ పోషకాలు (విటమిన్లు, ఖనిజాలు) ప్రత్యేక న్యూటా స్యూటికల్స్ సమద్ధిగా ఉంటాయన్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో సమగ్ర పోషణ కొరకు కనీసం 500 గ్రాముల పండ్లు, కూరగాయలు కలిగి ఉండాలన్నారు.పండ్లతో జామ్, స్క్వాష్, టుట్టి ఫ్రూట్టి, చిప్స్, ప్రెసర్వ్, డ్రైడ్ ఫ్రూట్స్, క్యాండి, సాస్ తయారు చేసి చూపించారు. హాజరైనవారికి వారపత్రికలు, సర్టిఫికేట్లు అందజేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానం


ప్రబలుతున్న విషజ్వరాలు

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

గుడ్లూరు మండలంలో ఉన్నటువంటి గ్రామాల్లో ఎస్‌టి కాలనీలో సైడ్ కాలువలు లేని కారణంగా వర్షపు నీరు నిలిచింది. ఇళ్లలోకి నీరు వస్తున్న ఎస్‌టి కాలనీలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.వర్షాలు, సీజన్ మారుతున్న నేపథ్యంలో మండలంలో విష జ్వరాలతో జనం ఆస్పత్రులకు క్యూ కడుతున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ చేపట్టడంతోపాటు మెడికల్ క్యాంప్‌లు పెట్టాలని కోరుతున్నారు. అన్ని గ్రామాల్లోని మంచినీరు బావుల్లో బ్లీచింగ్ వేసి నీరు సురక్షితం చేయాలని వీధులను శానిటైజర్ చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా వర్షాల సమయంలో వీచే ఈదురు గాలులకు కరెంటు తీగలు తెగి కిందపడి విద్యుత్ స్తంభాలు విరిగి పడే అవకాశమున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని జనం కోరుతున్నారు. మొగుల్లూరు గ్రామంలో మెయిన్ సెంటర్లో విద్యుత్ స్తంభం విరిగి పడింది. అటువంటి వాటిని గుర్తించి మార్చాలని కోరుతున్నారు.

మురుగు తొలగించరూ..

గుడ్లూరు మండలంలోని మోచర్ల, జానకంపేట, స్వర్ణజపురం. అడవి రాజుపాలెం . తెట్టు. రావూరు.గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. తద్వారా ప్రజలు అనారోగ్యం భారినపడే అవకాశముంది. దాదాపుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జ్వరాలు భారినపడుతున్నారు.వైద్యం కోసం కందుకూరు, కావలి ఆస్పత్రుల్లో చేరి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని జనం వాపో తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణ చర్యలు చేప ట్టాలని కోరుతున్నారు


గ్రామాల్లో నిలిచిన మురుగునీరు

మెడికల్ క్యాంప్‌లు పెట్టాలి

గుడ్లూరు మండలం లోని కొత్తపేట గ్రామంలో విష జ్వరాలు విజంభిస్తున్నాయి. గ్రామంలోని ప్రజలు వైద్యసేవల కోసం ప్రయివేటు ఆస్పత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కొత్తపేటలోని ఎస్సీ కాలనీ, గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి. ఇంటింటి సర్వే చేసి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలి. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలి

సుదర్శి నారాయణ,
కొత్తపేట




మృతుడుఖాదర్‌బాషా


ఖాదర్‌బాషా భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం నాయకులు ఖాదర్‌బాషా మృతి

ప్రజాశక్తి-కోవూరు :సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌కె ఖాదర్‌బాషా (76) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య, రైతు సంఘం నాయకులు ఎస్‌కె బాబు, ఆవాజ్ జిల్లా నాయకులు ఎస్‌కె చాన్‌బాషా, వవ్వేటి మల్లికార్జునరెడ్డి, ఇంతా శ్రీకాంత్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, సుబ్బారావులు సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఖాదర్‌బాషా కోవూరు పట్టణంలో కామ్రేడ్ సీతాపోలయ్య సారధ్యంలో కలిసి పనిచేశారన్నారు. అప్పటినుంచి స్థానిక సిపిఎం కార్యాలయంలో నిత్యం ప్రజా సమస్యలను తెలుసుకొని పని చేసే వారని కొనియాడారు. ప్రజా సమస్యలపై పనిచేసే అలాంటి వ్యక్తి మృతిచెందడం బాధాకరమన్నారు. కోవూరులో పార్టీకి తీరని లోటన్నారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం కచ్చితంగా నిక్కచ్చిగా నిర్మొహ మాటంగా ముక్కుసూటిగా మాట్లాడేవారన్నారు. పార్టీలో తనకు అప్పగించిన ఏ బాధ్యతను నిర్వర్తించడానికి ఎప్పుడు సంసిద్ధుడై ఉండేటువంటి వ్యక్తి కామ్రేడ్ ఖాదర్ బాషా అని కొనియాడారు.మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఖాదర్‌బాషా కుటుంబ సభ్యులకు పలువురు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఆయన అంత్యక్రియలు నేడు మధ్యాహ్నం జరుగునని కుటుంబ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి-కోవూరు:మండలంలోని ఇనమడుగులోని మిక్స్ కాలనీలో గత నాలుగైదు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో తీవ్రఇబ్బందులకు గురవుతున్నామని ఇనమడుగు గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం సచివాలయం ఎదుట బైటాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుత గతంలో ఇలాగే పలుమార్లు తమ కాలనీలో నీటి సరఫరాను నిలిపివేయడంతో అధికారులకు ప్రశ్నించడంతో వారు తిరిగి కుళాయిలకు నీరు వదలడం లేదన్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేస్తున్నారని, కాని కొందరు వైకాపాకు చెందిన రాజకీయనాయకుల వత్తిడిలతో తమ ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయడం లేదన్నారు. దీంతో తాము నీళ్ల లేక కూలీలకు పనులకు కూడ వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి తమ ప్రాంతంలో తాగునీటిని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనంతరం సర్పంచి ప్రమీలాను నీటి సరఫరా సక్రమంగా చేయకపోవడంపై చర్యలు తీసుకోవాలని కోరడంతో వారివురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులతో మాట్లాడి సక్రమంగా నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ఆమె వారికి హామీ ఇవ్వడంతో గ్రామస్తులు సర్దుమణిగారు.

కొత్త ఇంటి కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో హౌసింగ్ ఏఈ కొత్త ఇంటి వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,..ఇప్పటివరకు 201 అర్జీలు కొత్తగా గృహాల కోసం అర్జీలు పి ఎం ఏ వై 2.0 కింద నమోదు చేసుకోవడం జరిగింది. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా గిరిజన కుటుంబాలు ఇల్లు లేదని అర్జీ సమర్పించినచో అంతమందికి కొత్తగా గహాలను ప్రభుత్వం వారు మంజూరు చేస్తారని, ఈ శాంక్షన్ ఆర్డర్ మార్చి లేదా ఏప్రిల్ లో వస్తుందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఈ నెలలోపు గృహాలు మంజూరు కోసం తప్పనిసరిగా పీఎవై 2.0 కింద నమోదు చేసుకోవాలని, ఇప్పుడు నమోదు చేసుకున్న వారు రానున్న ఐదు సంవత్సరాల వరకు ఎప్పుడైనా కట్టుకోవచ్చని, లేకపోతే తర్వాత అవకాశం రాదని ఈ సందర్భంగా హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ మల్లినేని వివేక్ తెలిపారు.


దరఖాస్తు అందజేస్తున్న దృశ్యం

మున్సిపాలిటీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ కార్యదర్శి హజరత్తయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పరిశుద్ధ కార్మికులకు వేతనాలు పెంచారన్నారు. ఇప్పటికి ఇంజనీరింగ్ విభాగంలో, విద్యుత్ విభాగంలో పని చేసే కార్మికులకు ఆ రూ.15వేలు ఇస్తున్నారన్నారు. .గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారంగా ఇంజనీరింగ్, ఎలక్ట్రిసిటి కార్మికులకు జీతాలు పెంచాలని, గత లో మాకు ఉన్న సంక్షేమ పథకాలు ఉండేవి ఇప్పుడు ఆ సంక్షేమ పథకాలు కూడా లేవని ఆ సంక్షేమ పథకాలు కూడా తీసేశారన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కూడా లేదన్నారు. సుమారు 35 సంవత్సరాల నుండి ఆత్మకూరు గ్రామ పంచాయితీ ఉన్నప్పటి నుండి విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికి అయిన ప్రభుత్వం మాకు ఇవ్వాల్సిన జిత భత్యాలు, సబ్బు, నూనె, మాకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అధ్యక్షులు షేక్ మునీర్ బాబు, కోశాధికారి చెంచయ్య, ఉపకార్యదర్శి గోవిందు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె పెంచల్య, ప్రచార కార్యదర్శి కె నాగేంద్ర, డీ వాసు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె మస్తానయ్య, ఎన్ తిరుపాలు, కె బాబు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కబడ్డీ పోటీలకు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-ఉలవపాడు:మండలంలోని కరేడు పాతాళం వెంకటసుబ్బయ్య సేష్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు లకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నూరు శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 7వ తేదీన ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగిన 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా జట్టుకు పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న జాతీయ క్రీడాకారిణి కుమారి నిరీష, వాయుల. రోహిణి ప్రాతినిత్యం వహిస్తున్నారు. గత నెలలో సింగరాయకొండ మండలం, పాకల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు ఓగుపోయినా. శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కోటంగారి.బాలేశ్వరరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కాటం బత్తిన. కృష్ణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని, గ్రామస్తులు అభినందన తెలిపారు.

కబ్జాదారుల నుంచి భూమిని కాపాడండి

ప్రజాశక్తి-బిట్రగుంట: భూ కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలని మాజీ మండల అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బోగోలు మండలం, అక్కరాజు వారి కండ్రిగ గ్రామంలో భూ కబ్జా దారులపై ఫిర్యాదు చేసేందుకు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షులు పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోగోలు మండలం అక్క రాజు వారి కండ్రిగలో వందల సంవత్సరాల నుండి ప్రజా అవసరాల రైతులకు, పశువుల మేత నిమిత్తం ఉపయోగపడుతున్న 900 ఎకరాల ఇనాం భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించు ఉన్నారని తెలిపారు. అక్క రాజు వారి గ్రామంలో 400 కుటుంబాలు సాగు చేసుకుని రైతులు పశువుల మేతకు గ్రామం అభివృద్ధి కోసం వదిలేసిన సర్వే నెంబర్ 257,260 ఇనాం భూమిని కొందరు వ్యక్తులు భూ కబ్జా రాయుళ్లు రీ సర్వే పేరుతో తప్పుడు సర్వే నెంబర్లు వేసి వారిపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూ కబ్జా దారుల పేర్లను రిజిస్టర్ రికార్డుల్లో నుండి వారి పేర్లను తొలగించి వారిని కఠినంగా శిక్షించాలని, తమ గ్రామ రైతులను ఆదుకోవాలని కలెక్టర్ ను కలిసి విన్నవించుకున్నామని తెలిపారు.

గుంతలమయంగా రోడ్లు..

ప్రజాశక్తి-మర్రిపాడు:గ్రామీణ రహదారులు తారులేచి గుంతలతో అధ్వాన్నంగా తయారయ్యాయి. రహదారుల కు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.నిత్యం రద్దీగా ప్రయాణించే గ్రామీణ రహదా రులు నడవడానికి కూడా సౌకర్యంగా లేవు.చాలా అద్వాన్నంగా ఉన్నాయని ప్రజలు వాపో చతున్నారు. రహదారుల నిర్మాణం చేపట్టడంలో గత పాలకులు వైపల్యంచెందారు.ఏళ్ల తరబడి రహదారుల నిర్మాణాలు చేపట్టక పోవడంతో గుంతలతో దర్శన మిస్తున్నాయి. మండలకేంద్రం నుండి ఏపిలికుంటకు వెళ్ళు రహదారి గుంతల మయంగా మారి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రోడ్డు పనులు చేపట్టగా నాశిరకంగా పనులు చేపట్టి గుత్తేదారులు జేబులు నింపుకు న్నారు.రోడ్డు పై వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడు తున్నాయి. రహదారిపై నిలిచిన నీటినిఆర్అండ్ బిఅధికారులు రోడ్డు కూలీలచే తొలగించిన గుంతలు ఏర్పడవు.మండలంలో మర్రిపాడు నుండి తిక్కవరం, నెల్లూరు ముంబై జాతీయ రహదారి నుండి కండ్రిక మీదుగా భీమవరం, నందవరం, కష్టాపురం నుండి కంపసముద్రం, చాబోలు, సింగనపల్లి గ్రామాలకు వెళ్ల రోడ్లు గుంతలు ఏర్పడి అద్వాన్నంగా ఉన్నాయి.ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల కు గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలు పడిన రోడ్డు

ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతసాగరం: ఉభయ గోదావరి జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున పోటీ చేసి విజయం సాధించిన సందర్భంగా అనంతసాగరం మండల కేంద్రంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. సీనియర్ నాయ కులు, అనంతసాగరం మండల నాయకులు, వేము పెంచలయ్య మాట్లాడుతూ తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో యుటిఎఫ్‌తో సహా అనేక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా తొలి రౌండులోనే ఘన విజయాన్ని సాధించిన బొర్రా గోపి మూర్తికి అభినం దనలు ఓటు వేసిన ప్రభుత్వ,ప్రైవేటు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు అని అన్నారు.కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు వలి అహ్మద్, అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా, జనవిజ్ఞాన వేదిక నాయకులు గాడి సుధాకర్, నాయబ్ జానీ, రహంతుల్లా, అల్తాఫ్ భగత్, నాయబ్, మీరా మొహిద్దిన్, నాగులూరు వెంకటేష్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్లో తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:వార్షిక తనిఖీల్లో భాగంగా ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను డిఎస్‌పి కె వేణుగోపాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలిం చారు. పోలీసు అధికారులు, సిబ్బందితో ముఖాముఖి నిర్వహించి వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని సేవా సంబంధిత సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పోలీసు అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, బాధ్యతల నిర్వహణలో పోటీ పడాలని సూచించారు. అనంతరం డిఎస్‌పి స్టేషన్లోని సిబ్బంది నిర్వహించే పనుల గురించి అడిగి తెలుసుకుని తమకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబా టులో ఉంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది వారి బాధ్యతలపై దృష్టి సారించాలన్నారు. ప్రత్యేకించి సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పాత, కొత్త నేరస్తులపై నిఘా ఉంచాలని, ఏదైనా నేరపూరిత కార్యకలా పాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జిలానీ, సాయిప్రసాద్, ఏఎస్‌ఐ నజీర్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

కేజీవీల్స్‌తో ప్రధానరహదారిపై రావొద్దు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:రైతులు తమ ట్రాక్టర్లకు వ్యవసాయానికి వినియోగించే సమయంలో ఏర్పాటు చేసే కేజీవీల్స్ తో ఆర్ అండ్ బి రోడ్డు, జాతీయ రహదారిపైకి రావద్దని, అలా చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు పేర్కొన్నారు. సోమవారం జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు కేజీవీల్స్ తో వస్తుండడంతో వారిని తొలితప్పుగా హెచ్చరించారు. మరోమారు ఇలా కేజీవీల్స్ తో రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన మాట్లాడుతూ డీటీసీ చందర్ ఆదేశాల మేరకు ట్రాక్టర్లకు కేజీవీల్స్ ఏర్పాటు చేసి రోడ్లపైకి వచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నామని, వీటి వల్ల రహదారులు ఛిద్రం కావడమే కాక ప్రమాదాలు జరిగే ఆస్కారముందని, అందుకోసం కేజీవీల్స్ ఉన్న ట్రాక్టర్లను రోడ్లపైకి తీసుకురావద్దని సూచించారు.

అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు చెరువు ఓటర్ లిస్టులో అవకతవకలు ఉన్నాయని వైసిపి మండల కన్వీనర్ మద్ది బోయిన వీర రఘు పేర్కొన్నారు. సోమవారం బోగోలు మండల వైసీపీ నేతలు, కావలి ఆర్‌డిఒ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు మాట్లాడుతూ ఈ సందర్భంగా బోగోలు చెరువు ఓటర్ లిస్ట్ కు సంబంధించి అనేక అవకతవకలు ఉన్నాయని, దీని విషయమై గతంలో బోగోలు మండల తహాశీల్దార్ సురేష్ బాబుకు, కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కారణంగా కావలి ఆర్డీవో కలిసి ఓటర్ లిస్టులో అవకతవకలు సరిదిద్దాలని కోరారు. దీనికి ఆర్డిఓ సానుకూలంగా స్పందించి విచారించి తగు న్యాయం చేస్తానని తెలిపామన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి:ప్రస్తుత సీజన్ లో పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ శశిధర్ పేర్కొన్నారు.సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల రీత్యా పశువులకు గిట్టల పుండులు తదితర అనారోగ్యానికి గురైతే వెంటనే సంబంధిత పశువుల వైద్యులను సంప్రదించాలన్నారు. పశు రైతులు తప్పనిసరిగా సీజనల్ ప్రకారం టీకాలు తగిన సమయంలో వేయించుకోవాలన్నారు. పశువులు రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. పశువులకు సంబంధించిన పలు రకాల మందులు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని మండల పశు రైతులు సద్వినియోగం చేసుకొని మూగ జీవాలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మందులు అందజేస్తున్న దృశ్యం

ఆర్థిక పరిపుష్టత కోసం రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:మండల పరిధిలోని ఎఎస్‌పేట సచివాలయాల పరిధిలో లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు మండల పరిధిలోని అన్ని దుకాణాదారుల ఆధార్, పాన్ కార్డ్, కరెంట్ బిల్ , తీసుకొని అర్హులైన వారికి ఆర్థికంగా ఎదుగుదల కోసం లోను మంజూరు చేయుటకు ఎం ఎస్ ఎం రిజిస్ట్రేషన్ చేస్తున్నామని తెలిపారు.షాపు యజమానులు సహకరించాలని పంచాయతీ సెక్రటరీలు షరీఫ్ ,వినాయక్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేంద్ర, అగ్రికల్చర్ విఎఎ, శ్రీహరి, డిజిటల్ అసిస్టెంట్ వసుధ తెలిపారు.

యువతిని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట:మండలంలోని మైపాడు బీచ్ వద్ద ఓ వివాహితను ఆత్మహత్య నుంచి స్థానిక పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రక్షించిన ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే..నెల్లూరు సిటీ అయ్యప్ప గుడికి చెందిన మహిళ సూసైడ్ చేసుకుంటానని వారి కుటుంబ సభ్యులకు ఫోన్లో సమాచారం ఇచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు 112 సమాచారం అందించడంతో ఎస్సై నాగార్జున రెడ్డి చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్య చేసుకోబోయే హారిక ఫోన్ లొకేషన్ మైపాడు బీచ్ వద్ద ఉందని తెలుసుకున్నాడు. ఆమెను ఆత్మహత్య నుండి కాపాడి ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి చాకచక్యంగా వ్యవహరించి హారికను కాపాడిన ఇందుకూరుపేట పోలీసులను పర్యాటకులు ప్రశంసించారు.

రేషన్ బియ్యం తరలించే వారిపై చర్యలు

ప్రజాశక్తి-కావలి:రేషన్ బియ్యం తరలించేవారిపై కఠిన చట్టాలు ఉపయోగించాలని దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్‌డిఒకు వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ జిల్లాలో కావలికేంద్రంగా పెద్దపెద్దరైస్‌మిల్లులుఉన్నాయన్నారు. ఏ మిల్లులో రేషన్‌బియ్యం దొరికితే ఆమిల్లు జప్తు చేయాలని తరచుగా అధికారులు దాడులు జరపాలని తెలిపారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, ఆలూరిబ్రహ్మయ్య, కందిపట్ల రామదాసు, చెరుకూరి జనార్ధన్ పాల్గొన్నారు.

దేశ సంపదను అదానికి దోచి పెడుతున్నారు..

ప్రజాశక్తి-కావలి:గౌతం అదానీ గ్రూప్ కంపెనీల అవినీతి కుంభకోణంపై సమగ్ర విచార జరిపించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం కావలి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సామాన్య ప్రజలపై మోపుతున్న భారాలు పెంచిన8 నిత్యావసర సరుకుల పెట్రోల్ డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని , ఏపి రాష్ట్రంలో అదాని అవినీతిపై కుంభ కోణంపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అవినీతి పర్వంలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా జాయింట్ సెక్రటరీ సి.రాజగోపాల్, దమ్ము దర్గాబాబు, సిపిఐ కార్యదర్శి కె నాగారాజు, నరసింహారావు, బోసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతసాగరం: అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు నియోజకవర్గం యువజన కాంగ్రెస్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ అశోక్ నేతృత్వంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం విజయకుమార్, జిల్లా యువజన అధ్యక్షుడు వెన్నం నాగరాజు మరియు వైస్ ప్రెసిడెంట్ మనికంఠ మండల యువజన నాయకుడు కూకట్లపల్లి యుగంధర్, స్టూడెంట్ యువజన విభాగం నాయకుడు చి. వెంకట్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మాజీ పిసిసి కోఆప్షన్ మెంబర్ వేము హరిబాబు, రైతు సంఘం అధ్యక్షుడు మెంతెం రామకృష్ణారెడ్డి, ఆటో యూనియన్ షేక్ కరముల్లా పాల్గొన్నారు.

దాతలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-కావలి:కావలి పట్టణం తుపాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థకార్యాలయం లో ఆ సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నిత్యా వసర వస్తువులు ,బియ్యం, ప్రతి నెలా పోస్టాఫీసులో నగదు జమ చేస్తున్న పాస్, పుస్తకాలు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, నెల్లూరు జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

12న ఎర్ర చెరువు వేలం

ప్రజాశక్తి-అనంతసాగరం:మండలం పడమటి కంభంపాడు ఎర్ర చెరువు వేలంపాట సోమవారం జరగాల్సి ఉండగా వేలంపాట దారులు పాల్గొనక పోవడంతో 12వ తేదీకి వాయిదా వేసినట్లు గ్రామ సర్పంచ్ కత్తి లావణ్య, పంచాయతీ కార్యదర్శి ఎన్ పుల్లయ్య తెలిపారు. ఈ చెరువు వేలంపాటలో పాల్గొనే వారు పదివేల రూపాయలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు. ప్రభుత్వం మూడు లక్షల 50 వేల రూపాయలు ధర నిర్ణయించిందని చెరువును దక్కించుకున్న వారు మూడు లక్షల 50 వేలు లో సగం చెల్లించాలని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు సచివాలయంలో చెరువు వేలం పాట జరుగుతుందని తెలిపారు.


హుండీలోని నగదును లెక్కిస్తున్న దృశ్యం

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-దుత్తలూరు:మండలం లోని నర్రవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి హుండీ ఆదాయం లెక్కించారు. పి.కవిత, కార్యనిర్వహణాధికారి, శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవ స్థానం, నవాబుపేట అధికారి పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి వి. ఉష శ్రీ ఆధ్వర్యంలో శ్రీ అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించారు.4 నెలల 2 రోజులకు గాను మొత్తం రూ.21,79,632/- లు నగదు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బృందం, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామ సదస్సుకు మంత్రి రాక

ప్రజాశక్తి-మర్రిపాడు: భూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులలో మంగళవారం ఉదయం 9 గంటలకు పొంగూరు లో జరుగు గ్రామ రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు తెలిపారు.

'చిలుమూరికి' పురస్కారం

ప్రజాశక్తి-కావలి: కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజీ లోని కామర్స్ డిపార్ట్మెంట్ కు శాఖాధి పతిగా ఉన్న ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు "విశిష్ట పరిశోధ కుడు" పురస్కారాన్ని, సోమవారం చెన్నయ్ లోని గ్రీన్ పార్క్ హోటల్ లో వీనస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు నిర్వహిం చిన పదవ వార్షిక రీసెర్చ్ మీట్ లో అందుకున్నారు. వీరు గతంలో వి.ఎస్.యు. పిజి సెంటర్ స్పెషల్ ఆఫీసర్ గా, కాలేజీకి ప్రిన్సిపల్ గాపని చేశారు. 30 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగి 14 పుస్తకాలు ముద్రించారు. 41 జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ లో తన పరిశోధన పత్రాలు ముద్రించ బడ్డాయి. మూడు జాతీయ సెమినార్లు నిర్వహించారు. రెండు రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు.


పురస్కారం అందజేత

కార్యకర్తకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట:బోగోలు మండలం, కోవూరు పల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త అమూల్ సాల్మన్ సోమవారం ప్రమాదవశాత్తు మిషన్ లో పడి పొట్ట కట్ అవటంతో కావలి పట్టణం ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఆపరేషన్ చేసుకొని చికిత్స పొందు తున్నాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఉన్న హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శిం చారు.ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసు కున్నారు. కుటుంబానికి అండగా ఉంటానని తెలి పారు. ఆయనతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, సాల్మన్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి:ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి మాతృ వందనం యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలను వైద్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గర్భిణి, బాలింతలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వారికి పలు సూచనలు చేసి ముఖ్యంగా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు అధికంగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఠాగూర్, అనీషా, వెంకట సుబ్బయ్య సిబ్బంది నవాజ్ గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఉలవపాడు:గతేడాది డిసెంబర్ నుంచి జనవరి వరకు 42 రోజులు అంగన్‌వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జరిగిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రాట్యూటీ, ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ సెంటర్లను, మెయిన్ సెంట్రల్ గా మార్చాలని పలు సమస్యల సాధన కోసం ఈనెల 12 తేదీన ఉలవపాడు ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరుగు ధర్నా కార్యక్ర మానికి ఉలవ పాడు ప్రాజెక్ సిడిపిఒ అరుణకు అనుమతి కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉలవపాడు మండల కార్యదర్శి ఎస్‌డి గౌస్ బాషా, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సి. హెచ్ ఇంద్రావతి, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రభుత్వాలు అండ

ప్రజాశక్తి-సైదాపురం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వికలాంగులకు సహాయ పరికరాలు ఉపకరణాలు ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన వయో వృద్ధులు, వికలాం గులు134 మంది ఉన్నారు. వారి లోపాలు దృష్ట్యా 90 మందికి బ్యాటరీ ట్రై సైకిళ్లు 26 మందికి హియరింగ్ మిషన్లు 14 మందికి బ్యాటరీ వీల్ చైర్లు,4 వైట్ కేన్ స్టిక్స్ ఎంపిక చేయబడింది.ఎంపికైన వారికి పది రోజుల లోపు సహాయ ఉపకరణాలు వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు. ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆడియాలజిస్ట్ శ్రీకాంత్.ట్రైనింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

ప్రజాశక్తి-కావలి:అవినీతి వ్యతిరేక చట్టాల పై అవగాహన పెంచుకొని, మహాత్మా గాంధీ కలలు కన్నా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని లోక్ సత్తా ఉద్యమ నేత ఎం.మాలకొండా రెడ్డి కోరారు. డిసెంబరు 9 ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం పట్టణంలోనే పాతఊరు మునిసిపల్ ఉన్నత పాఠశాల ఆవరణంలో అవినీతి నిరోధక చట్టాలపై అవ గాహన సదస్సు ను నిర్వహించారు మాలకొండా రెడ్డి మాట్లాడుతూ అవినీతి వ్యతిరేక చట్టాల పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, లక్ష్మీ ప్రసూన, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు నివాళులు

ప్రజాశక్తి-కావలి:పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, బ్రాహ్మణపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన తుళ్లూరి సురేష్ (37), ఆయన భార్య తుళ్లూరి వనిత(32), ఉప్పాల ఏబులు (65), కావలి పట్టణంలోని వైకుంఠపురం కు చెందిన తాతా పెద్ద తిరుపతయ్య (50) భౌతిక కాయాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఒకే కుటుంబంలో భార్య, భర్త చనిపోవ డంతో వారి నివాసం వద్ద హృదయ విధారక ఘటనకు ఎమ్మెల్యే చలించిపోయారు.సురేష్ పిల్లల భవిష్యత్తుకు అండగాఉంటా నని భరోసా కల్పించారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి.:వికలాం గులు రక్తదానం చేయడం గర్వకారణ మని కావలి ఆర్డిఓ వంశీ కృష్ణసోమవారం పేర్కొన్నారు. స్థానిక రెడ్ క్రాస్‌లో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కావలి రెడ్ క్రా స్ భవనంలో వికలాంగులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, దివ్యాంగుల కాలనీ ప్రెసిడెంట్ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో 119వ అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు.కార్యక్రమంలో తల్లిబోయిన శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం ,గాలం మాల కొండయ్య, కోడూరు సోమయ్య, ప్రళయ కావేరి రాజు ,మరియమ్మ, బాషా పాల్గొన్నారు.

